# శిక్షమ్మలు

వసుంధర



నాకు చాలా ఉత్సాహంగా ఉంది.

కానీ దాన్ని పైకి కనబడనివ్వడం లేదు.

నాకు చాలా సిగ్గుగా ఉంది. అది మాత్రం ప్రదర్శిస్తున్నాను.

ఆ రోజు నాకు పెళ్ళి చూపులు. అదీ మొదటిసారి పెళ్ళి చూపులు!

వరుడు బ్యాంకులో గుమాస్తా అట. నెలకు ఏడొందల పైన వస్తుందట.

మా ఇంట్లో నేను మొదటి ఆడపిల్లను కాదు. ఇద్దరాడపిల్లల తర్వాత ఇద్దరు మగపిల్లలు పుట్టాక ఐదో సంతానంగా తల్లితండ్రులకు

జన్మించాను నేను. ఐతే ఇంట్లో మగ, ఆడ అందరిలోకి నేనే అందంగా వుంటాను. మా ఇంట్లో ఏం ఖర్మ, ఊళ్ళో నేను అంద గత్తెగా ప్రసిద్ధికెక్కాను.

ఇంటర్మీడియేట్ చదివే రోజు ల్లోనే నా వెంట యూనివర్శిటీ స్టూడెంట్స్ పడేవారు. వాళ్ళ చిలిపి మాటలు నాకు తమాషాగా ఉండేవి. నా పట్ల వాళ్ళకున్న ఆకర్షణ నాకు గర్వకారణ మయ్యేది. అబ్బాయి లంటే ఎప్పుడూ ఇష్టమే నాకు. ఆ ఇష్టమేమిటో సరిగ్గా అర్థంగావి రోజులవి.

ఇంటర్మీడియేట్ అయిన ఆర్నె ల్లకు ఊళ్ళో ప్రైవేట్ కంపెనీలో నా కుద్యోగం దొరికింది. నెలకు నాలుగొందలు జీతం. ఉద్యో గంలో చేరి ప్రైవేట్‌గా బియ్యేకి కట్టమన్నారు నాన్నగారు.

అన్నేళ్ళ చదువు నాకు నేర్పని అనుభవం ఆర్నెల్ల ఉద్యోగం నేర్పింది.

ఆడదంటే మగవాడికి ఆకర్షణ ఉంది. వయసులో వున్న ఆడ దానికి మగవాడి తోడూ కావాలి. ఈ రెండింటి కోసం సమాజం పెళ్ళిని సృష్టించింది.

అయితే నావంక చూసే మగ వాళ్ళలో, నన్ను కోరే యువ కుల్లో నన్ను పెళ్ళి చేసుకోవాలన్న కోరిక లేదు. నా బాధ్యత స్వీకరించకుండా తాత్కాలికమైన పారి తోషికం ముట్టజెప్పి నాతో గడపా లన్న అభిలాష చాలామందికి ఉంది.

ఈ విషయం గ్రహించగానే నేను అబ్బాయిలకు దూరంగా వుంటున్నాను.

అయితే ప్రసాద్ విషయంలో అలా కుదరడం లేదు.

ప్రసాద్ మా ఊళ్ళోని ఓ బ్యాంకులో ఆఫీసరు. నాకంటే ఐదేళ్ళు పెద్ద ఉంటాడు. మనిషి సినిమా హీరోలా వుండకపోయినా ఆకర్షణీయంగా వుంటాడు.

నన్ను మొదటిసారి బస్ స్టాప్‌లో చూసినప్పుడే అతను ఏదో వంక పెట్టుకుని చనువుగా పలకరించి నా పేరడిగి తన పేరు చెప్పేశాడు.

అతనిపట్ల నేను కుతూహలం చూపలేదు. కానీ అతను మా పరిచయాన్ని పెంచడానికి తన ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. ఫలితంగా అతను నాకు పరిచితుడు కాక తప్పలేదు. దాన్ని పురస్క రించుకుని అతను నన్ను సినిమా లకూ, పార్కులకూ, బీచికీ ఆహ్వానించాడు. ఒక్క ఆహ్వా

నాన్నీ నేను మన్నించలేదు.

అయినా అతను నన్ను వదల లేదు. నేను ఒంటరిగా దొరికితే చాలు, వదిలేవాడు కాదు. పలక రించి కబుర్లు మొదలు పెట్టేసే వాడు.

అతను నన్ను ప్రేమించాడట. నేనూ ప్రేమించానంటే నా పెద్దల అనుమతి తీసుకుని పెళ్ళి చేసు కుంటాడట.

"నేను నిన్ను ప్రేమించలేదు" అని స్పష్టంగా చెప్పానతనికి.

దానికి అతను పింపుల్‌గా నవ్వేసి, "ఎదురుగా ఆకాశంలో నక్షత్రాలు కనబడుతూంటాయి. వాటిని నువ్వు రోజూ చూస్తూం టావు. అయితే అవెన్ని ఉన్నాయో చెప్పగలవా?" అన్నాడు.

"చెప్పలేను...."

"ఒకవేళ నువ్వు ఏదైనా సంఖ్య కల్పించి చెప్పావనుకో, అది నక్షత్రాల లెక్క అవుతుందా?"

"అవదు."

"నువ్వు నన్ను ప్రేమించ లేదన్నా అంతే! అది నిజం అవదు" అన్నాడతను.

"అంటే?"

"ఆకాశంలో చంద్రుడు కన బడతాడు. ప్రతిరోజూ సూర్యు డుదయిస్తాడు. మన చుట్టూ కనపడ కుండా గాలి ఉంది. ఇవన్నీ మన అవసరాలు. అయినా వీటి ఉనికి గురించి మనం పట్టించుకోం. మనం పట్టించుకోనంత మాత్రాన అవి అవసరాలు కాకపోవు...."

"నువ్వు నాకు అవసరం కాదు" అన్నాను.

"మిస్ సుజాతా! నేను నీకు అవసరం కాకపోవచ్చు. కానీ ఈ వయసులో నీకో మగతోడు అవసరం. నీకు మగతోడు కావ డానికి అవసరమైన అర్హతలన్నీ నాకున్నాయి. నువ్వు నన్నెందుకు ప్రేమించలేవు?" అన్నాడు ప్రసాద్.

"నాకు ప్రేమమీద నమ్మకం లేదు. నాన్నగారు నా గురించి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు. నా పెళ్ళి నా నిర్ణయంమీద జరుగదు. నాన్న గారి నిర్ణయంపై జరుగుతుంది."

"నీకు ఇష్టం ఉందీ, లేనిదీ ఒక్క ముక్క చెప్పు. అప్పుడు నేనే ఎలాగూ మీ నాన్నగారి దగ్గరకు వెడతాను."

"నాన్నగారికి ఇష్టమైంటే నాకూ ఇష్టమే! ఆయనకిష్టం లేక పోతే నాకూ లేదు."

అతను చిరాగ్గా నావంక చూసి, "మీ నాన్నగారి ఇష్టాలు నాకు తెలుసు. ఆయనకు కులం కావాలి.

గోత్రం కావాలి. వంశ మర్యాద కావాలి. అంతే! అబ్బాయి అమ్మాయిని ప్రేమిస్తున్నాడా లేదా అన్నది అక్కర్లేదు అబ్బాయి తన కాళ్ళ మీద నిలబడి తన భార్యను పోషించుకోగలడా అన్నది కూడా ముఖ్యం కాదు."

"నీతో మాటలూ ముఖ్యం కాదు" అని వెళ్ళిపోయానప్పుడు.

ప్రసాద్ సంప్రదాయపు పద్ధతులకు వ్యతిరేకమట. కులమతాలకీ. కట్నానికీ అతీతంగా ఉండే వివాహాన్నే అతడు కోరుకుంటున్నాట్ట. అందుకే పెద్దలద్వారా అమ్మాయి ఇష్టాన్ని సంపాదించడం అతడి కిష్టంలేదు. అమ్మాయి ఇష్టం ద్వారా పెద్దల ఆమోదాన్ని సంపాదించడం అతడి అభిమతం.

నా ధోరణి అతడికి నిరుత్సాహం కలిగించింది. అయినా అతడు నన్ను వదలలేదు. నాకు మాత్రం అతణ్ణి వదిలించుకోవాలని ఉంది.

అలాంటి సందర్భంలో ఈ పెళ్ళిసంబంధం వచ్చింది.

పెద్దల ఏర్పాట్లకూ, పిన్నల ఏర్పాట్లకూ ఎంత తేడా ఉంది?

ప్రసాద్‌తో రోజూ మాట్లాడుతున్నా నాకెటువంటి అనుభూతులూ కలగలేదు. ఇప్పుడున్న ఉత్సాహం, సిగ్గు అప్పుడు లేవు.

వరుడి రాకకోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నాను.

ఆఖరికి ఆ శుభఘడియ రానే వచ్చింది.

అవసరం లేకపోయినా నన్ను చక్కగా అలంకరించారు. ఓ మంచి ముహూర్తం చూసి నన్ను పెళ్ళివారి గదిలోకి నడిపించారు. చాపమీద కూర్చోమన్నారు. సిగ్గు ముంచుకు వస్తూన్న కారణంగా నేను చాలాసేపు వంచిన తల ఎత్తలేదు. అయితే నాకు మాటలు వినబడుతూనే ఉన్నాయి. నా గురించిన వివరాలడుగుతున్నారు వాళ్ళు. నాన్న జవాబివ్వబోతుంటే వారించి నన్నే చెప్పమంటున్నారు. నేను నెమ్మదిగా జవాబు లిచ్చాను.

"కంఠం బాగుంది. ఓ పాట పాడమ్మా!" అందో స్త్రీ కంఠం. అది వరుడి తల్లిది.

కాస్సేపు జంకినా ఓ పాట పాడాను. అంతా బాగుందన్నారు.

నా చదువు గురించి అడిగారు. ఉద్యోగం గురించి అడిగారు. అభిరుచుల గురించి అడిగారు. అన్నీ వారికి నచ్చినట్లే ఉన్నాయి. మధ్యలో ఒకసారి నేను ధైర్యం చేసి వరుణ్ణి చూశాను. అప్పుడతను నా వంకే చూస్తున్నాడు. ఇద్దరి

చూపులూ కలుసుకోగానే నా ఒళ్ళంతా గిలిగింతలు పెట్టినట్లు అయింది. వరుడు ప్రతాప్ నా కంటికి అందంగానే కనిపించాడు.

"ఈ సంబంధం కుదిరితే నేను అదృష్టవంతురాలినే!" అనుకున్నాను.

వాళ్ళు వెళ్ళిపోయారు. నాన్నగారీ సంబంధం మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

వారం రోజుల తర్వాత మధ్యవర్తుల నుంచి కబురు వచ్చింది. పెళ్ళివారికీ సంబంధం నచ్చింది. అందువల్ల కట్నం పదిహేనువేలు చాలు నన్నారు. చాలా మంది పాతిక వేల దాకా ఇస్తామని వస్తున్నారట. కానీ పిల్ల నచ్చడం వల్ల కట్నం తగ్గించారు.

"పదిహేను వేలా?" అని నోరావలించాడు. ఆయన మొత్తం పెళ్ళి అన్ని ఖర్చులతోటీ పదిహేను వేలలో జరిపించే ఉద్దేశ్యంలో ఉన్నాడు. అప్పటికీ అప్పుచేయాలి!

"పిల్ల సుఖపడుతుంది. డబ్బు దగ్గర చూసుకోకండి!" అన్నాడు మధ్యవర్తి.

"అది కాదండీ! మా పిల్ల ఉద్యోగం చేస్తోంది. నెల తిరిగే సరికి నాలుగొందలకు తక్కువ కాకుండా వాళ్ళ చేతిలో పడతాయి. అందుకయినా మాకు కాస్త కన్సెషన్ ఇవ్వాలి!" అన్నాడు నాన్న.

"ఆ పిల్ల ఉద్యోగం చేస్తోంది కాబట్టి, కట్నమివ్వడం నీకు సులువని వాళ్ళనుకుంటున్నారు" అన్నాడు మధ్యవర్తి.

అప్పటికి ఏ సమాధానమూ చెప్పకుండా వూరుకున్నాడు నాన్న. తర్వాత ఇంట్లో ఈ విషయమై తర్జన భర్జన జరిగింది. అది చాలా మంచి సంబంధమనీ, ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోరాదనీ అమ్మ అంది.

"ఇంక ఉన్నది ఒక్కగానొక్క పిల్ల! డబ్బుకేముంది? ఎలాగో అలా వస్తుంది" అంది అమ్మ.

ఇది నా పెళ్ళి గురించిన విషయం కాబట్టి నేను మాట్లాడకుండా వూరుకున్నాను. కానీ ప్రతాప్ కట్నం అడిగినందుకు నాకెంతో ఉక్రోషంగా ఉంది.

ప్రతాప్‌కింకెవరో ఇరవై వేలు కట్నమిస్తానన్నారుట.

అదృష్టం చేయి జారిపోయిందేమోనని నేను భయపడ్డాను. ఆ సమయంలో నాకు ఇంకో సంబంధం వచ్చింది.

వీళ్ళు పదివేలు కట్నం చాలన్నారు. నాన్న పెళ్ళి వారి గురించి

ఆరాలు తీయసాగాడు.

ఈలోగా ప్రసాద్ నన్ను మళ్ళీ కలుసుకున్నాడు. "పాపం ప్రతాప్ సంబంధం చెడిపోయింది కదూ!" అన్నాడతను.

అది వెటకారమో, సానుభూతో నాకు తెలియలేదు. జవాబివ్వలేదు నేను.

అతను జేబులోంచి ఒక ఫోటో తీసి ఇచ్చాడు. "ఈమె ప్రతాప్ భార్య!"

ఆమె నల్లగా ఉంది. ఎత్తు పళ్ళు. ప్రతాప్ ఆమె ప్రక్కన మరింత అందంగా మెరిసి పోతున్నాడు.

"అదృష్టవశాత్తూ ఈమె డబ్బున్న ఇంట పుట్టింది. లేకపోతే పెళ్ళి కావడం కష్టం. ఆమె డబ్బున్న వారింట పుట్టినా ప్రతాప్ వంటి ధనాభిలాషు లుండకపోతే ఆమెకు పెళ్ళి కాదు. అందుకే భగవంతుడు దయామయుడన్నారు" అన్నాడు ప్రసాద్ నావేపు చూస్తూ.

"నువ్వు నన్ను వదలనంత కాలం భగవంతుడు దయామయుడని నేననుకోను" అంటూ అక్కణ్ణించి లేచి వచ్చేశాను.

ప్రసాద్ చూపిన ఆ ఫోటో నన్ను కలచివేసింది. ఈ లోకంలో డబ్బొక్కటే ప్రధానమా? అందానికి విలువ లేదా? కట్నమివ్వలేని ఆడపిల్ల కన్యగా మిగిలిపోవలసిందేనా?

ఎన్నో ప్రశ్నలు నన్ను వేధించినా కన్ను కలచివేస్తున్న విషయం వేరే వుంది. ఇంతకాలం ఎందరో నా అందాన్ని అభినందించారు. ప్రతాప్ వచ్చి నన్ను చూసి వెళ్ళాడు. మరొక్క ఐదు వేలకోసం నన్ను వదులుకొని ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. నా అందం ఐదువేలపాటి చెయ్యదు. కనీసం ప్రతాప్ అలా అనుకున్నాడు.

మర్నాడు ప్రసాద్ నాన్నను కలుసు కున్నాడు. ఆయనకు తన ఆదర్శాలగురించి చెప్పాడు. చివర్న తన ఉద్దేశ్యం బయటపెట్టి, "తప్పనిసరై మీ అనుమతికోసం వచ్చాను" అన్నాడు.

"కులం, గోత్రం లేనివాడికి మా అమ్మాయినివ్వడం జరుగదు" అన్నాడు నాన్న చాలా ఖచ్చితంగా.

ప్రసాద్ మళ్ళీ నన్ను కలుసుకున్నాడు.

"నిన్ను నిన్నుగా ప్రేమించే నన్ను పెళ్ళి చేసుకోవడం కోసం మీ నాన్నను కాదనలేవా?" అన్నాడు.

"కాదనలేను" అన్నాను.

"నీ వ్యక్తిత్వాన్ని నేను

ప్రేమించలేను. కానీ నీ అందాన్ని నేనింకా ప్రేమిస్తూ, గౌరవిస్తూనే ఉన్నాను. నిన్ను కట్నమడగడం అంత దౌర్భాగ్యం వేరే లేదని అనుకుంటున్నాను. అయినా నన్ను ప్రేమించలేవా?" అన్నాడు ప్రసాద్.

మాట్లాడకుండా అక్కణ్ణించి వెళ్ళిపోయాను. అంతకంటే జవాబేమివ్వాలి?

నాకు వచ్చిన రెండో సంబంధం కూడా చెడిపోయింది. వరుడికేవో దురలవాట్లున్నాయని నాన్నకు తెలిసింది.

"అందుకే వాళ్ళు బొత్తిగా పదివేలే కావాలన్నారు" అంది అమ్మ- అక్కడికదేదో చాలా తక్కువైనట్లు.

ఈలోగా నాకు మూడో సంబంధం వచ్చింది. వచ్చినవారు ప్రతాప్ తలిదండ్రులే!

పదిహేనువేలు కట్నమిస్తే వాళ్ళ పెద్దబ్బాయికి నన్ను చేసుకుంటారుట.

ముందు చిన్నవాడికి పెళ్ళై తరువాత పెద్దవాడికి పెళ్ళేమిటని నాన్న ఆందోళన పడ్డాడు. కానీ అసలు సంగతి తెలిసింది.

వాళ్ళ పెద్దబ్బాయి ప్రసాద్! అతను ప్రతాప్‌కంటే సంవత్సరం మాత్రమే పెద్దవాడు. అతడి పెళ్ళికి కట్నం తీసుకుంటానన్నారని అలిగి ఇంట్లోంచి బయటకు వెళ్ళిపోయాడు. తలిదండ్రులతో తెగతెంపులు చేసుకున్నాడు. ఇప్పుడు తన తప్పు తెలుసుకుని మళ్ళీ తలిదండ్రులను చేరాడు. సుజాతనే పెళ్ళి చేసుకుంటానని అతడు పట్టు పట్టాడుట!

జరిగిన పొరపాటుకు నాన్న చాలా విచారించాడు. కట్నం దగ్గర ఎన్నో బేరాలాడాడు. వాళ్ళు ఒక్క పైసాకూడా దిగిరాలేదు. ఆఖరికి పెళ్ళి నిశ్చయమయింది.

"మొత్తంమీద మన సుజాత అదృష్టవంతురాలు!" అన్నారంతా.

నాన్న కష్టపడి డబ్బు పోగేశాడు. పెళ్ళి జరిపించాడు.

కాపురానికి వెళ్ళాక నేను ఆయనతో అన్నాను - "పాపం, నాన్నకు చాలా అప్పులున్నాయండీ- మనం సాయం చేయాలి!"

ప్రసాద్ కోపంగా పళ్ళు పటపటలాడించి — "నీ మీది వ్యామోహంతో నేను అన్ని ఆదర్శాలనూ చంపుకున్నాను. కట్నం పుచ్చుకుంటే తప్ప పెళ్ళికాని గతి పట్టిందినాకు. ఇందుకు మీ నాన్నను నేను క్షమించలేను. నా పెద్దల పేరు చెప్పుకోకుండా నా పెళ్ళి జరగాలన్న పంతం మీనాన్న కారణంగానే దెబ్బతింది. అందుకాయన శిక్షార్హుడు! అనుభవించనీ!" అన్నాడు.

*